కథా నిలయం
5453
శ్రీకాకుళం



# యక్షప్రశ్నలు

ధర్మరాజుకి మరోపేరు యుధిష్ఠరుడు అంటే యుద్ధమందు స్థిరముగా నిలబడువాడు. గెలుపుమీదే దృష్టి వుంచి నిలబడువాడు. మరి కర్ణపర్వంలో, కర్ణుని పోటుమాటలు వినలేక యుద్ధభూమి వదలి వెళ్లిపోయాడే అంటారేమో! కర్ణుడే నేర్పుగా హేలన చేస్తూ ధర్మజుని తోలేశాడు.

''నువ్వు వచ్చావెందుకూ ధర్మజా! నీ తమ్ముడర్జునుడేమైనాడు? నాకు భయపడి నిన్ను నెట్టాడా నా ముందుకి? నేను మీ అమ్మకి వరమిచ్చి వూరడించి పంపాను. అర్జనుని మీద తప్పితే తక్కినవారి మీద నాకు పగలేదు. వానిని వదలను. తక్కిన వారిని వదిలేస్తా. నాకు కోపం రాకముందు, నా యెదుటినించి వెళ్లిపో ధర్మజా. మాట తప్పుతానేమో ధర్మజా. పో. నీ తమ్ముడిని పంపు'' అని తరిమేశాడు.

''నా తల్లికి యీ సూతపుత్రుడు వరమివ్వటమేమిటో, నా తల్లి వీడినెప్పుడు దర్శించి వరమడిగిందో?'' అని ఆలోచిస్తూ అవమానభారంతో గుడారానికెళ్లాడు ధర్మజుడు.

పాముగా మారి నీటి అడుగున్న వున్న నహుష చక్రవర్తి అడిగినవాటిని విశదీకరించి, దాహార్తి తీర్చుకుని తమ్ములను బతికించుకొని, నహుషుడిచ్చిన మంచి నీటి పాత్రతో, తమ్ములు వెంటరాగా, ద్రౌపది వున్నచోటికి వెళ్లాడు ధర్మరాజు.

ఇపుడు ధైర్యంగా, యక్షప్రశ్నలకి జవాబివ్వదలచి నిలబడ్డాడు ధర్మజుడు.

1. సాధారణంగా అందరికీ మూడు వచ్చు. అవేమిటి?

   సంగీతము, వైద్యము, వేదాంతము

2. వైరాగ్యమెన్ని రకాలు? అవేవి?

   మూడు రకాలు. అవి ప్రసూతి వైరాగ్యం, పురాణ వైరాగ్యం, స్మశాన వైరాగ్యం.

3. యెవర్నన్నా నీ నెత్తిన రుద్దమంటావా, రాగానే డబ్బు అందిస్తావా? అనే వారినేమంటారు?

బ్లాక్ మెయిలర్స్ అంటారు.

4. పనిగట్టుకెళ్లి పుట్టరేప్పెట్టటమో , యింట్లో పొగ లేవదీయటమో చేసే వారి నేమనచ్చు?

చీడపురుగులనచ్చు

5. నిలువెల్ల విషమెవరికుండును?

ఖలునకు.

6. గుడ్లు పెట్టుకు చూస్తుంటే యేమనాలి?

నీ టాపిక్ వారికి రాదనాలి. జవాబివ్వలేక అలా చూస్తారనాలి.

7. అంటించినట్లు మాటలాడుతూ వినోదించేవారి సైకాలజీ యెట్టిది?

అసూయగ్రస్తులు అనచ్చు. అవివేకం. సంస్కారం లేదనాలి. లో మొరేల్ అంటే సరిపోతుంది.

8. తన పిత్రార్జితం మంగళం పాడించి, కలవారిని గురించి ''వారికేమీ! పదితరాలకు సరిపడా వున్నది. వీరికేమీ! బాగా సంపాయించుకో వీలైన పెద్ద జాబ్ '' అని పేలే వారి నేమందాము?

వారి సమర్థతా తెలివితేటలు చూసి అసూయ అనాలి.

9. పక్క చూపులెందుకు చూస్తారు ?

వంచించటమెలా అని చూస్తారు.

10. వేళ్లకు కారం రాచుకు వస్తారంటే ?

బాగా నొవ్వనాడి వెళ్తారని.

11. చేతులు వెనక్కు కలిపి పెట్టుకుని, వెనక్కు చూస్తూ వెళ్లే వారినేమందాము?

బాగా యేడిపించి మరీ వెళ్తున్నానా లేదా అని వెనక్కు చూస్తూ వెళ్తున్నారనాలి.

12. అందరి అభిలాషా యేమిటి ?

యెదుటివారు తమ పైత్యాన్ని ఎంజాయ్ చేయాలి.

13. ఈసుకీ అసూయకీ పెద్ద తేడా వున్నదా?

ఉన్నది. తమకి లేనివి వారికున్నాయే అని కుళ్లటం అసూయ. వారికదిలేకుండా చేయాలనుకోటం యీసు. అవేనా తమ్ముడు దుర్యోధనుని లొంగదీసినై. ద్రౌపది మాకు భార్యగా రావటమేగాక మా ఐకమత్యం కాపాడుతున్నదని, ఆమెను మా నుండి విడదీసి, మాకు చెందకుండా చేస్తే చెల్లా చెదరౌతామని ప్రయత్నించాడు.

14. బలవంతుడేగా యెందుకు సఫలత పొంద లేదు?

నా తమ్ముడర్జునుడు, బుద్ధిని కేంద్రీకరించి, ఏకాగ్రతతో మత్స్య యంత్రం కొట్టి శక్తిని స్వాధీనం చేసుకున్నాడు. ఒకసారి స్వాధీనమైన శక్తి తన భక్తులను వదిలి వెళ్లదు. ద్రౌపది అనే శక్తి మాతోనే వున్నది.

15. రాజుకంటె బలవంతుడెవడు?

మొండివాడు.

16. నేల చూపులకర్థమేమి?

అయిష్టత.

17. మొండివాడి ముక్కు కోస్తే లాభిస్తుందా?

లాభించదు. రక్తం తాగి తియ్యగా వుందంటాడు.

18. భార్యా భర్తలకు ఒకరి మీద నేరాలు మరొకరి కి చెప్పటంలో ఐడియా?

వారిని విడదీయాలని.

19. పెళ్లెందుకాడతారు?

తమ నైజం బయట పెట్టటానికి.

20. కోర చూపులకర్థమేమిటి?

వంచించినా, నష్టపెట్టినా బాగానే వున్నారే? యేమిటి రహస్యం? అని

కోరచూపు చూస్తారు.

21. మెత్తని వారినిచూస్తే యేమనిపిస్తుంది?

మొత్తాలనిపిస్తుంది.

22. కొంతమంది ఆలోచనలు బావున్నా గమ్యమెందుకు చేరరు?

యేమార్గాన వెళ్తే గమ్యం చేరగలము అని ఆలోచించరు.

23. కొంతమంది యెంత ప్రయత్నించినా వారి కోరిక నెరవేరదెందుకని?

దైవకృపను, దైవబలాన్ని నమ్మక మానవబలం మీద నమ్మకముండటవల్ల. అర్జునుడు దైవబలం మీదే నమ్మకముంచాడు గెలిచాడు.

24. గద్దకూ రాబందుకూ తేడా యేమిటి?

గద్ద తన్నుకు పోయి చంపి తింటుంది. రాబందు చచ్చినవాటినీ, కుళ్లిన మాంసాన్నీ గూడా తింటుంది.

25. యెప్పుడూ యెవరిమీదో బడి తినటం విశిష్టతా?

కాదు. వారిని పరాన్న భుక్కులంటారు.

26. కష్టనష్టాలు మానసిక వేదనా కలిగించే వారిని యెవరితో పోలిస్తే సరిపోతుంది?

శూర్పణఖతో.

27. సిగ్గులేని మొహానికి సింగారమేది?

నవ్వు.

28. పులి క్రూరమృగం గదా! దానితో యెందుకు పోలుస్తారు?

మృత్యువు పొంచివున్నదని గ్రహించీ, మేకపిల్లను యెరపెట్టారని తెలిసీ, మంచెమీద తుపాకీతో వున్న వేటగాడిని చూసి గూడా, గుండు తాకినా, పరాక్రమం చూపుతూ మంచె మీది కెగిరి, వేటగాడిని కిందికి లాగి గోళ్లతో గీరి చంపాలనే చూస్తుంది పులి. అదే శౌర్యం. అందుకని పోలుస్తారు. వెరపు లేదు అని.

29. తన చిత్తమొచ్చినట్లు ప్రవర్తించే స్త్రీనేమంటారు?

స్వైరిణి అంటారు.

30. గుడ్లు పెట్టుకునెందుకు చూస్తారు?

దెప్పుళ్లకి సమాధానం చెప్పలేక.

31. చదవేస్తే ఏం పోతుంది?

ఉన్న మతిపోతుంది.

32. సాధారణంగా అందరికీ వుండేదేమిటి?

హిస్టీరియా.

33. యెండలో తిరిగినా వస్తుంది. ఏసీ గదిలో కూచున్నా వస్తుంది. యేమి తిన్నా వస్తుంది. యేమీ తినక పోయినా వస్తుంది. కొత్త మనుషులొచ్చినా వస్తుంది. కొత్త దుస్తులు వేసినా వస్తుంది. గాలి వేసినా వస్తుంది. నీరు తాగినా వస్తుంది. ఇలా పిలవకుండా వచ్చేదేమిటి?

ధర్మజుడు నవ్వు ఆపుకుంటూ అన్నాడు :- ఎల్లర్జీ

34. నిన్ను కొందరు వ్యాఖ్యాతలు జూదరి అని వ్యాఖ్యానించారు. యేమని చెప్పుకుంటావు ధర్మజా?

నేను జూదరిని కాను. జూద గృహాలు, లాభసాటిగా నష్టమెదుర్కోకుండా, కష్టమర్సుకి నష్టం రాకుండా నడపటం నేర్పుతూ నేను ఒక గృహం నడిపేవాడిని. దాన్ని లాటరీ అనచ్చు. ద్రౌపది భార్యగా వచ్చాక గూడా ఆమెకీ జూదమాడటం నేర్పాను. ఆమెతోనూ ఆడేవాడిని. మాయా జూదం, మాయా పాచికలు అనే వూహే లేదు నాకు. దుర్యోధనుడు వినోదం కోసం జూదమాడదాం రమ్మంటే, ద్రౌపది వార్నింగిచ్చినా, రాను అంటే పిరికి వాడంటారని మనోవినోదం కోసమే గదా అని వెళ్లాను. నిషధేశ్వరుడూ జూదమాడదాం రమ్మంటే వెళ్లాడుగా! దమయంతీ దేవిని పణంగా పెట్టుగెలుస్తావేమో అనగానే లేచిపోయినాడు. నేనా పనిచేసి

పొరపాటు చేశాను. కాని వ్యసనపరుడిని కాను. జూదరిని కాను. ఒప్పందం ప్రకారం అడవులకు వెళ్లేప్పుడు పాచికలు నా కుడిచేతిలోనే వున్నాయి. నేరుద్దామని తీసికెళ్లాను. నల మహారాజు అక్షహృదయం నేర్చే చివరికి గెలిచాడు. జూదానికి పిలిచి గెలిచి రాజ్యం లాగాలని కాదు నా ఐడియా. విరటుని కొలువులో విరాట్రాజుతోనూ వినోదం కోసమే ఆడాను అంతేగాక రాజరాజు భీష్మపితామహుడు పడిపోగానే గురువు ద్రోణాచార్యుని సర్వసైన్యాధిపతిని చేశాడు. గురువు ద్రోణాచార్య చాలా సంతోషించి, ''రాజరాజా! మీతాత పడిపోయాక, నీ ప్రియమిత్రుడు కర్ణుని సర్వసైన్యాధిపతి చేస్తావు లెమ్మనుకున్నాను. కాని నా మీద గౌరవముంచి నాకా పదవి కట్టబెట్టావు. యేదైనా అడుగు యిస్తాను'' అంటే ''ధర్మరాజుని పట్టి తెండి గురూ!'' అన్నాడట మహారాజు. ''మళ్లా జూదానికాహ్వానించాలనా?'' అనుకుని ''మాట యిచ్చాను తెస్తాను'' అన్నాడుట గురువు. చారులు చెప్పారు. ఈ మాటు మాయపాచికలుండవు. నా పాచికలతోనే ఆడాలి శకుని అని పాచికలాట ఆపలేదు. నేను జూదరిని గాను. మా రాజ్యం గెలవటానికే జూదం.

35. సమంజసంగా వున్నది ధర్మజా.

36. ద్రౌపది తాను చాలా చదువుకున్నాననీ, నిన్ను అవమానించి చిన్నబుచ్చాలనీ, జవాబు చెప్పలేవనే అహంతో ''నన్నోడి తన్నోడెనా, తన్నోడి నన్నోడెనా?'' అనే ప్రశ్నపంపి తికమక పెట్టిందనీ అన్నారు పరిశీలకులు. ఒప్పుకుంటావా?

ఒప్పుకోను. ఆ పరిశీలకులు అహమేవ పండితః అనే కోవలోని వారంటాను. వ్యాసమహర్షి జయ అనే కావ్యాన్ని గానం చేస్తూ పోతుంటే వినాయకుడు వ్రాస్తూ పోతున్నాడట. వినాయకునికి ఆలోచించే పని కల్పించి వినాయకుడు దీని కర్థమేమిటి అని వ్రాయటం ఆపి ఆలోచిస్తుంటే, వ్యాస మహర్షి వెళ్లి తన కాలకృత్యాలూ భోజనం పూర్తిచేసి

వచ్చి గానం మొదలెట్టేవాడట.

వినాయకుని ఆలోచిస్తూ కూచోబెట్టిన ఘట్టాన్ని వ్యాస ఘట్టమంటారు. మానవ జీవితంలో వ్యాస ఘట్టాలు వస్తూనే వుంటాయి. పరమాత్మ వాటిని దాటిస్తాడు. రాముడంతటివాడు చెట్టుచాటున నిలబడి వాలిని చంపాడు. దానిని తులసీదాస సమర్థించాడు. అవసరమైతే ధర్మ రక్షణ చేయటానికి అధర్మ మార్గం తొక్కటానికి భగవంతుడు వెనుకాడడు. వాలిని చంపటం తనకోసం కాదు. సుగ్రీవుని కోసం. నిశితంగా చూస్తే కృష్ణపరమాత్మ నేర్పుగా, చాకచక్యంగా గెలుపుకి మార్గాలు కనిబెట్టాడు గాదా. ఆనాటి సభలో కర్ణుని కొడుకు వికర్ణుడున్నాడు. వాడు లేచి చెప్పాడు. ''ద్రౌపదీదేవిని పణంబెట్టే హక్కు ధర్మరాజుకు లేదు. తండ్రి తనకూతురును యిస్తున్నాను అంటాడు గాని అమ్ముతున్నాను అనడు. ముందు తనను తాను పణం బెట్టి ఓడిపోయిన ధర్మరాజుకి అప్పటికి స్వేచ్ఛా జీవి అయిన ద్రౌపదీ దేవిని పణంపెట్టే హక్కు అసలే లేదు'' అని చెప్పాడు.

ఆపద వచ్చినప్పుడు తప్పించుకునేందుకు మార్గాలు చూస్తారు. ఏకవస్త్రను అన్నది ద్రౌపది. సేవకుడు వెళ్లిపోయాడు. మరిది దుశ్శాసనుడొస్తే, వానినీ పంపాలని ఆ తికమకబెట్టే ప్రశ్న వేసింది. మరిది కసలే అర్థంగాక, 'సభలో తేల్చుకుందువుగాని రా'' అని జుట్టుపట్టుకు లాక్కెళ్లాడు. అనాగరకులిలా చేస్తారు అని మహర్షి బ్లంట్‌గా చెప్పాడు. ద్రౌపదికి నేనంటే గౌరవమే. విరటునితో పాచికలాడుతుంటే విరాట్రాజు సారె విసిరితే నా నుదుటికి తాకి రక్తపు చుక్కలు కిందబడకముందే ద్రౌపది తనకొంగు నా నుదుటికి ఆనించింది, అంతేగాని ''అంతే గావాలి'' అనలేదు. కౌరవులను గెలిచి ఆవులను మళ్లించుకొచ్చింది నీ కొడుకు ఉత్తరుడు కాదు బృహన్నల అన్నా. '' ఆ పేడి మూతివాడు నాట్యం నేర్పేవాడు కౌరవులను గెలవటమేమిటి?''అని కోపగించి పాచిక విసిరాడు రాజు ''నువ్వెందుకే అడ్డావు?'' అన్నాడు. ''ధర్మజుని రక్తపుబొట్టు కిందబడితే ఒక్కో బొట్టుకి యేడేళ్లు క్షామం వస్తుంది'' అన్నది. దాంతో నేనెవరో తెలుసుకున్నాడు రాజు. గెలిచాక ''అందరూ పోయాక సింహాసనమెక్కటమేమిటి'' అని యేడిస్తే

ద్రౌపది సముదాయించి, నచ్చ చెప్పి సింహాసనమెక్కించింది. అటువంటి ద్రౌపది నన్ను కించపరచటమేమిటీ?'' అంటుంటే యక్షుడు పెద్దగా నవ్వుతూ రాగా, ధర్మజుడూ యక్షుడూ, చేతులు కలిపి నవ్వుతూ వెళ్లారు.

*******